بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 18.05.2018 (Telugu)**

# ఉపవాస వాస్తవమును అర్థము చేసుకొనుట, దాని ఉద్దేశమును పొందుటకు ప్రయత్నించుట అహ్మదీయులమైన మన గొప్ప బాధ్యత. దైవభీతి కలిగించుకొని, దైవభీతిలో ప్రగతి చెందుటయే రమజాన్ ఉద్దేశము

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 18.05.2018 తేదీన - మస్జిద్ మస్జిద్ బైతుల్ ఫుతూహ్-లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అల్‌బఖరహ్ అధ్యాయములోని 184వ సూక్తిని పఠించి, దాని అనువాదము వినిపించిరి. يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُوْنَ అనగా ఓ విశ్వాసులారా! మీరు ధార్మికులు కావలయునని మీ కంటే పూర్వమున్న వారికి విధించబడినట్లే మీకును ఉపవాస నియమము విధించబడినది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము మనము మరొక రమజాన్ మాసములో అడుగుపెట్టే అనుగ్రహము పొందినాము. ఈ నెలలో ముస్లిములలోని చాలా మంది ఉపవాసముతో పాటు నమాజులు, తరావీహ్ కొరకు మస్జిద్‌నకు వస్తారు. ఇటువైపు శ్రద్ధ కలుగును. మన మస్జిదులలో కూడ ఈ రోజులలో ఇతర రోజుల కంటే ఎక్కువ మంది వస్తారు. విధించబడిన ఈ ఉపవాసముల ఉద్దేశము దైవభీతి. ఇస్లాం ఒక శాశ్వత ధర్మము. ప్రళయ దినము వరకు కొనసాగును. దాని బోధన శాశ్వతమైనది. నేడు ప్రపంచములోని ప్రతి చోట పవిత్ర ఖుర్‌ఆన్ తన యదార్ధ స్థితిలో గలదు. దైవభీతిని అనుసరించేవారి కొరకు మార్గదర్శనము. చివరి కాలములో మన సంస్కరణ, పవిత్ర ఖుర్‌ఆన్ ప్రచురణ, దానిని ఆచరించుటకు శ్రద్ధ కలిగించేందుకు, మార్గము చూపేందుకు అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను పంపెను. వారిని విశ్వసించే అనుగ్రహము మనకు లభించెను. ఉపవాస వాస్తవమును అర్థము చేసుకొనుట, దాని ఉద్దేశమును పొందుటకు ప్రయత్నించుట అహ్మదీయులమైన మన గొప్ప బాధ్యత. దైవభీతి కలిగించుకొని, దైవభీతిలో ప్రగతి చెందుటయే రమజాన్ ఉద్దేశము. రమజాన్‌లో మనము ధార్మికతను పొందుటకు ప్రయత్నింతుము లేదా ప్రయత్నించువారమైనప్పుడు తమ ప్రార్థనల వైపు దృష్టి కలుగును. ధార్మికతను అనుసరించుటకు ప్రయత్నించినప్పుడు ఉపవాసము కూడ వుందుము, దుష్టత్వముల నుండి దూరముండుటకు ఆలోచన కలుగును. అల్లాహ్ తఆలా ఆదేశములను అన్వేషించి వాటిని ఆచిరంచుటకు శ్రద్ధ కలుగును. మనము దుష్టత్వముల నుండి దూరముండకపోయినచో ఉపవాస లక్ష్యము నెరవేరదు. ఉపవాసముండి కూడ మనలో అహంకారమున్నచో, తమ పనులు, తమ మాటలలో అనవసర గర్వమున్నచో, తన డప్పు తానే కొట్టుకొను అలవాటున్నచో, ప్రజలు తమను పొగడాలను కోరిక వున్నచో, తమ సిబ్బంది తమను ప్రశంసించుటను మనము ఆశించుచున్నచో, పొగిడిన వానిని ఇష్టపడడం, దానిని కోరుకోవడం ధార్మికత కాదు. ఉపవాసముండి వివాదము, కలహాలు, అసత్యము, అశాంతి నుండి మనము దూరముండనిచో ఇది ధార్మికత కాదు. ఉపవాసముండి ప్రార్థనలు, దుఆలు, సత్కార్యములలో సమయము గడపనిచో ఇది ధార్మికత కాదు. ఉపవాస లక్ష్యము నెరవేరడం లేదు. రమజాన్‌లో దుష్టత్వములను వీడి, సత్కార్యములను అవలంభించుటయే ఉపవాస లక్ష్యమును నెరవేర్చుట అగును. మానవుడు ఇందులో స్థిరత్వము పొందుటకు ప్రయత్నించినప్పుడే ఉపవాస ఉద్దేశమును పొందువాడగును. లేనిచో ఆకలితో వుండుట మాత్రమే అగును. మీరు ఈ ఉద్దేశములను పొందనిచో మీరు ఆకలి, దాహముతో వుండుట అల్లాహ్ తఆలాకు అవసరం లేదని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. ఉపవాసము లేకున్నను ఉపవాసమున్నామని కొందరు ఉపవాసము పేరున మోసము కూడ చేస్తారు. తమ ఆహారముపై అదుపు లేనివారే వీరు. వీరు కొన్ని గంటలు కూడ అల్లాహ్ తఆలా కొరకు తినకుండా వుండలేరు. కొందరు రోజంతా ఉపవాసమున్నను సరియైన రీతిలో నమాజులు, ప్రార్థనల వైపు దృష్టి సారించరు. ఒకటి రెండు

నమాజులు మాత్రమే చదువుతారు. అల్లాహ్ తఆలా ఆదేశించిన, నిషేధించన విషయముల వైపు దృష్టి సారించరు. మీరు ధార్మికత అవలంభించాలని అల్లాహ్ తఆలా ఆదేశించిన ఉద్దేశమును ఇటువంటి ఉపవాసములు పూర్తి చేయలేవు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించిన తరువాత అల్లాహ్ తఆలా ఆదేశించిన విధముగా తమ ఉపవాసముల హక్కు చెల్లించు గొప్ప బాధ్యత అహ్మదీయులమైన మనపై గలదు. దైవభీతి (ధార్మికత) ఏమిటి? దానిని ఎలా పొందవలెనో గ్రహించుటకు ప్రయత్నించవలెను. ధార్మికులెవరో అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనేక సందర్భములలో మనకు బోధించిరి. నిజమైన ఆనందము, అభిరుచి వాస్తవానికి దైవభీతితోనే కలుగును. ప్రాపంచిక అభిరుచులలో ఆనందము లేదు. ప్రతి పని అల్లాహ్ తఆలా ఇష్టము, అతని ప్రీతిని పొందుటకు చేసినప్పుడు ఒకరు నిజమైన విశ్వాసి కాగలడు. ఈ ఒక్క విషయమే విశ్వాసి, అవిశ్వాసిలో తేడాను చూపును. దైవ జ్ఞానములో మానవుడు ప్రగతి చెందాలని వారు మనకు సూచించిరి. రాబోవు ప్రతి దినము మనము దైవజ్ఞానములో అభివృద్ధి చెందుటకు కారణము కావలెను. ఇప్పుడు నేను ధార్మికత గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వివిధ పంక్తులను వినిపింతును. వారిట్లనిరి. చాలా సార్లు అల్లాహ్ తఆలా తరపున ఇట్లు దైవవాణి అందెను. మీరు ధార్మికులగుము. దైవభీతితో కూడిన సూక్ష్మ మార్గములను అనుసరించుము. అల్లాహ్ తఆలా మీతో వుండును. మన జమాఅత్ నిజమైన దైవభీతి, పవిత్రత పొందుటకు నేను ఏమేమి చేయగలనని ఒక్కోసారి నా హృదయములో కలత కలుగును. నేను ఎంతగా దుఆ చేస్తాననగా దుఆ చేయుచు బలహీనత కలుగును. కొన్ని సార్లు స్పృహ కోల్పోయి క్రింద పడిపోయే పరిస్థితి ఎదురగును. అల్లాహ్ తఆలా దృష్టిలో ఒక జమాఅత్ ధార్మికత కలగనిచో అది అల్లాహ్ తఆలా సహాయ సహకారము పొందలేదు. సమస్త పవిత్ర గ్రంధములు, తౌరాత్, ఇంజీల్ బోధనల సారాంశము ధార్మికతయే. అల్లాహ్ ధార్మికత (తక్వా) అను ఒక్క పదములోనే అల్లాహ్ తఆలా గొప్ప ఇష్టమును, సంపూర్ణ ప్రీతిని వ్యక్తపరచెను. నా జమాఅత్‌లోని నిజమైన ధార్మికులు, ప్రాపంచికముపై ధార్మికతకు ప్రాధాన్యతనిచ్చే, అల్లాహ్ వైపు దృష్టి మళ్లించే వారిని వేరే చేయాలని నేను ఆలోచించుచున్నాను. తద్వారా వారికి నేను కొన్ని ధార్మిక పనులు అప్పగించెదను. అనంతరం ప్రాపంచిక పనులలోనే నిమిగ్నమై, రాత్రింబవళ్ళు నిషేధిత ప్రాపంచికమును పొందుటకు ప్రయత్నించేవారిని లెక్క చేయను.

నా జమాఅత్‌లోని ప్రతి వ్యక్తి ధార్మికతను పాటించాలని, ప్రాపంచికము కొరకే తపన పడకూడదని వారికి కలత వుండెను. ధార్మికతను పాటించుటయే శాసనపు సారాంశము, దుఆలు ఆమోదము పొందాలని మీరు ఆశించుచున్నచో ధార్మికతను పాటించమని సూచించుచు వారిట్లనిరి.

అహ్మదీయులను సంబోధించుచు ఇట్లనిరి. వారు ధార్మికతను అనుసరించవలెను. ఎందుకనగా ధార్మికతనే శాసనపు సారాంశమని అనగలము. శాసనమును సంక్షిప్తముగా చెప్పదలచినచో శాసననము మూలమే ధార్మికత అని అనవచ్చును. ధార్మికతలో అనేక స్థాయి అంతస్థులు గలవు. కాని సదుద్దేశముతో ఆశించువారు ప్రాథమిక స్థాయిలను నిలకడ, వినమ్రతతో దాటినచో ఈ సత్యము, నిష్టాపరత వలన గొప్ప స్థాయికి చేరుకొనును. వారిట్లనిరి. అల్లాహ్ తఆలా ఇట్లనెను. إِنَّمَا يَتَقَبَّلُ اللّٰهُ مِنَ الْمُتَّقِيْنَ- అనగా అల్లాహ్ తఆలా ధార్మికుల దుఆలను ఆమోదించును. ఇది అతని వాగ్దానము. إِنَّ اللّٰهَ لَا يُخْلِفُ الْمِيْعَادَ అతని వాగ్దానము తప్పక నెరవేరును. అందుకే అతడిట్లనెను. దుఆ ఆమోదము కొరకు ధార్మికత ఒక అత్యవసర నిబంధన, ప్రాథమిక నియమము. ఇది విడదీయరానిది. కనుక నిర్లక్ష్యము, దుర్మార్గమునవలంభించు వాడు దుఆ ఆమోదము పొందాలని కోరుట అతని అవివేకము, పిచ్చితనానికి నిదర్శనమగును. కనుక దుఆల ఆమోద ఆనందము, అభిరుచి పొందుటకు, విశ్వాసమును పెంపొందించుకొనుటకు మన జమాఅత్‌లోని ప్రతి ఒక్కరు సాధ్యమైనంత వరకు ధార్మికత మార్గములను అనుసరించవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. రమజాన్ నుండి లబ్ది పొందుటకు మన ఉపవాసములు, మన కర్మలు ధార్మికత పొందుటకే అగుట ఒక ప్రాథమిక సూత్రము. మేము చాలా దుఆలు చేశాము, కాని దుఆలు ఆమోదించబడవని చాలా మంది అంటారు. వారి అంతరంగికములో ధర్మము విజయము పొందినాదా? అని గమనించవలెను. వారు ధార్మికతను అనుసరించుచున్నారా? లేదా ప్రాపంచికము ఎక్కువగా కలుషితమైనదా? దుఆ ఆమోదము కొరకు దైవభీతి అనివార్య నిబంధన. మరల వారిట్లనిరి. వాస్తవానికి ధార్మికుల పట్ల పెద్ద పెద్ద వాగ్దానములు గలవు.

అల్లాహ్ తఆలా ధార్మికుల మిత్రుడైనప్పుడు ఇంతకంటే గొప్పది మరేముండగలదు.

అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَمَنْ يَّتَّقِ اللّٰهَ يَجْعَلْ لَّهٗ مَخْرَجًا- وَّيَرْزُقْهُ مِنْ حَيْثُ لَا يَحْتَسِبُ అనగా అల్లాహ్‌కు భయపడువాని కొరకు అతడు ఏదేని ముక్తి మార్గమును చూపును. అతడు ఊహించని వైపు నుండి అతడు అతనికి ఆహారము నొసంగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ దుఆ కూడ అధికముగా చేయవలెను. ఈ దుఆను గుర్తుంచుకోవలెను. ఎల్లప్పుడు గుర్తుంచుకొన్నచో దైవభీతిని అనుసరించుట వైపు కూడ దృష్టి కలుగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రపంచములో సుఖము, విశ్రాంతి పొందాలని కోరుటయే మానవుని అతి పెద్ద కోరిక. ఇందుకు అల్లాహ్ తఆలా ఒక్క మార్గమే సూచించెను. అనగా ధార్మికతను పాటించుట. మరో విధంగా చెప్పాలంటే దీనిని పవిత్ర ఖుర్ఆన్ మార్గము అనవచ్చును. లేదా దానిని సత్పథము అనవచ్చును. అవిశ్వాసుల వద్ద కూడ ధనము, ఆస్తి వుండును, వారు ఆనందము, ఐశ్వర్యముతో జీవితము గడుపుతారని ఎవరు అనకూడదు. నేను నిజముగా చెప్పుచున్నాను. వారు నీచమైన ప్రాపంచికులు, బాహ్యమును ఇష్టపడే వారి దృష్టిలో ఆనందముతో వున్నట్లు కనిపిస్తారు. కాని వాస్తవానికి వారొక బాధ, దుఃఖములో వుందురు. మీరు వారి ముఖమును చూస్తారు కాని నేను వారి హృదయమును చూచుచున్నాను. వారొక జ్వాలలు గ్రమ్ము అగ్ని, వివిధములైన గొలుసులు, వలయములలో చిక్కుకొని వున్నారు. అందుకే అతడిట్లనెను. اِنَّآ اَعْتَدْنَا لِلْكٰفِرِيْنَ سَلٰسِلَاْ وَاَغْلٰلًا وَّسَعِيْرًا అనగా నిశ్చయముగా మేము అవిశ్వాసుల కొరకు వివిధములైన గొలుసులు, వలయములు, ఒక జ్వాలలు గ్రమ్ము అగ్నిని స్థిరపరచి వున్నాము. ఒక గుడిసెలో ధార్మికుడు నిజమైన ఆనందము పొందవచ్చును. అత్యాశ గల ఒక ప్రాపంచికునికి అట్టి ఆనందము గొప్ప కోటలో కూడ లభించదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వున్నదానిలోనే తృప్తి పడుటు, ధార్మికత వున్నచో అల్లాహ్ తఆలా ప్రీతి లక్ష్యమైనచో వసతుల కొరతలో కూడ మానవుడు వుండగలడు. ఆనందము, అభిరుచి ఏర్పడును. కాని పెద్ద పెద్ద ధనికులకు ఆనందము లభించదు. ప్రాపంచికము ఎక్కువ లభించిన కొద్ది ఆపదలు పడుచుండును. నిజమైన ఆనందము, సుఖము ప్రాపంచికునికి లభించలేదని గుర్తుంచుకొనుము. అధిక ధనము, అందమైన దుస్తులు, ఆహారము ఆనందమునకు కారణము కాలేవు. వాస్తవానికి ధార్మికతయే ప్రధానం. నిజమైన ధార్మికత లేనిదే ఎటువంటి ఆనందము, సంతోషము లభించదని తెలిసినప్పుడు సాలె పురుగు వల వలె ధార్మికతలో అనేక విభాగాలున్నవని అర్థము చేసుకోవలెను. మానవునికి సంబంధించిన విశ్వాసములు, నాలుక, ప్రవర్తనలు మొ॥ వాటి గురించి ధార్మికత గలదు. దీనిని వివరించుచు హుజూరె అన్వర్ ఇట్లనిరి. విశ్వాసములలో కూడ దైవభీతి వుండవలెను, నాలుకలో కూడ దైవభీతి వుండవలెను, సాధారణ ప్రవర్తనలలో కూడ ధార్మికత వుండవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇతరులను బాధించకుండా నాలుకను అదుపులో పెట్టుకోవాలని మాత్రమే ఆదేశము లేదు, స్వప్రదర్శన, తనను తానే ఇష్టపడు, దర్శనము కూడ పుణ్యములు, ధార్మికత నుండి దూరము చేయును. వారిట్లనిరి. గమనించండి! అల్లాహ్ తఆలా اِيَّاكَ نَعْبُدُ అని బోధించెను. మానవుడు తన శక్తిని నమ్ముకొని అల్లాహ్ తఆలా నుండి దూరమయ్యే ప్రమాదముండెను, అందుకే వెంటనే اِيَّاكَ نَسْتَعِيْنُ ను బోధించెను. నేను ఈ ప్రార్థన నా శక్తి, బలముతో చేయుచున్నాని భావించకుము. అల్లాహ్ తఆలా సహాయము లేనిదే, ఆ పవిత్ర ఉనికి అనుగ్రహించనిదే ఏమియును సాధ్యము కాదు. నాలుక వలన మానవుడు ధార్మికత నుండి దూరమగును. హదీసులో ఇట్లు గలదు. బొడ్డు క్రింద వున్న అవయవము, నాలుకను దుష్టత్వము నుండి రక్షించుకొన్న వ్యక్తికి స్వర్గము లభించునని నేను నమ్మకముగా చెప్పుచున్నాను. మీరు మీ నాలుకలను ఏలుము. నాలుకలు మిమ్ములను శాసించరాదు. అనవసర మాటలు పులకకుము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మానవుడు మనసును వీడి అల్లాహ్ తఆలా ఉద్దేశముల ప్రకారము నడుచుకొన్నప్పుడు అతని ఏ కార్యము అక్రమము కాజాలదు. ప్రతి పని దైవ భీతి ప్రకారముండును. ప్రజలు అల్లాహ్ తఆలా ఇష్టము ప్రకారము నడుచుకోన్నప్పుడే ఆపదలలో పడిపోతారు. ఇటువంటి తమ కోరికలను అనుసరించును. ఉదా॥ ఆగ్రహానికి లోనై ఏదో ఒక పని చేసినందున నేరపూరిత వాఙ్మయములు ఏర్పడును. దైవ గ్రంథమును వీడి ఏ పని చేయనని ఏవరైనా సంకల్పించినచో నిశ్చయముగా దైవ గ్రంథము అతనికి సలహా

ఇచ్చును.

మనము మన జీవితము సాదా, సీదా గడపాలని సూచించుచు వారిట్లనిరి. ధార్మికులు తమ జీవితము సాదా, సీదా గడపాలనే నిబంధన గలదు. ఇది ధార్మికతలోని ఒక విభాగము. దీని ద్వారా మనము అనవసర కోపమును ఎదురించవచ్చును. పెద్ద పెద్ద జ్ఞానులు, సత్యవంతులు, ధార్మికులకు కోపము నుండి దూరముండుటయే చివరి, కఠినమైన దశ. కోపము వల్లనే అహంకారము ఏర్పడును. నా జమాఅత్ వారు పరస్పరం చిన్నా పెద్దా భావించుట లేదా ఒకరు మరొకరిని గర్వముతో చూచుటను నేను కోరుకోవడం లేదు. ఎవరు పెద్దో ఎవరు చిన్నో దేవునికి తెలుసు. ఇదొక రకమైన అవమానము. ఒకరి పేరు మరొకరు అవమానకరంగా పలుకకూడదు. ఇది నేరస్తులు, దుష్టుల అలవాటు. ఒకరిని అవమాన పరిచనవాడు అదే అవమానానికి గురి కానంత వరకు అతడు మరణించడు. తమ సోదరులను నీచముగా చూడకుము. ఒకే చెలిమతో నీరు త్రాగుచున్నప్పుడు ఎవరి అదృష్టములో ఎక్కువ నీరు గలదో ఎవరికి తెలుసు. ప్రాపంచిక సూత్రముల వలన ఒకరు గౌరవనీయులు, మరాదస్తులు కాలేరు. ధార్మికుడే అల్లాహ్ తఆలా దృష్టిలో అధిక గౌరవనీయుడు. إِنَّ أَكْرَمَكُمْ عِنْدَ اللَّهِ أَتْقَاكُمْ అనగా నిస్సందేహముగా అల్లాహ్ దృష్టిలో మీలో నుండి అందరికంటే ఎక్కువ నిస్టాపరుడే, అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు, నిశ్చయముగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సదా జాగరూకుడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఏదేని ఆపద వచ్చినచో విశ్వాసి దేవుని పట్ల చెడుగా భావించడు. అతడు దానిని తన తప్పిదముల ఫలితముగా భావించి అల్లాహ్ కరుణ, శుభము కొరకు వేడుకొనును. ఆ కాలము గడిచిపోయినప్పుడు అతని దుఆలు సత్ఫలితములనిచ్చును. ఆ బలహీన కాలమును అతడు మరచిపోక దానిని గుర్తుంచుకొనును. ధార్మికతను అవలంభించువారికి అల్లాహ్ సహకరించును. మనము ఈ జమాఅత్‌లో చేఇరనామని మాత్రమే గర్వపడకూడదు. నిజమైన ధార్మికత కలిగి, పుణ్యులైనప్పుడే అల్లాహ్ తఆలా తోడు, సహాయము లభించును. అల్లాహ్ తఆలా కూడ మానవుల దినచర్య సిద్ధము చేయును. మానవుడు కూడ తన పనుల దినచర్య సిద్ధము చేసుకోవలెను. సత్కార్యములలో ఎంత వరకు ముందడగు వేసినాడో గమనించవలెను.

రమజాన్‌లో ధార్మికతతో ఉపవాసముంటుడకు, ప్రార్థన చేయుటకు, ఇతర హక్కులు చెల్లించుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించును గాక! అన్ని విధాలా ఈ రమజాన్ జమాఅత్‌నకు, ముస్లిములకు కూడ శుభదాకమగును. ప్రపంచము కొరకు కూడ ప్రత్యేకంగా దుఆ చేయగలరు. పాకిస్తాన్‌లో జమాఅత్ పరిస్థితుల దృష్ట్యా రోజు రోజుకు కఠినత్వము పెరుగుచున్నది. అల్లాహ్ తఆలా శుభము కలిగించుగాక! మనము ఉపవాసముల హక్కు చెల్లించువారమగుదుము గాక! ధార్మికతను పాటించుచు హక్కు చెల్లించువారమగుదుము. ప్రపంచము ఎంత వేగంగా యుద్ధము వైపు వెళ్ళుచున్నదనగా దీనిని నివారించుటకు ఎలాంటి సూచనలు కనిపించడం లేదు. అందుకే అల్లాహ్ తఆలా ముస్లిములను, అహ్మదీయులను ఈ యుద్ధపు దుష్ప్రభావముల నుండి రక్షించుగాక! ఇదే విధముగా ఇతర ప్రజలను దీని దుష్ప్రభావముల నుండి రక్షించుగాక! అల్లాహ్ తఆలా దృష్టిలో వీరి సంస్కరణకు ఏదైనా అవకాశమున్నచో సంస్కరణ అగుగాక! వీరు అల్లాహ్ తఆలాను గుర్తించి వినాశనము నుండి తప్పించుకొందురు గాక!(ఆమీన్)

BOOK POST (PRINTED MATTER)

To,

........................................................................

........................................................................

........................................................................